సురక్షిత ప్రయాణం.. కావాలి లక్ష్యం

‘ఫోన్ ఇన్’లో జిల్లా ఉప రవాణా కమిషనర్ కరీమ్

కలిదిండి, న్యూస్‌టుడే : ‘సురక్షిత ప్రయాణమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలి’ అని జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ తెలిపారు. ‘ఈనాడు - మీ తోడు’ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘ఫోన్ ఇన్’లో ప్రజల సమస్యలకు పరిష్కారాలు, సూచనలు అందించారు. అతి వేగం, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, మైనర్ డ్రైవింగ్‌తోనే అత్యధిక ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్న ఘటనల్లో శిరస్త్రాణం ధరించని చోదకుల సంఖ్యే ఎక్కువగా ఉంటుందన్నారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు.

సమస్యకు పరిష్కారం చెబుతున్న కరీమ్

? రెండేళ్ల కిందట లైసెన్సు కార్డుకు రుసుము చెల్లించా. నేటికీ కార్డు రాలేదు. **- అడపా వీరబ్రహ్మస్వాములు, వెంకట్రామన్నగూడెం, తాడేపల్లిగూడెం**

» 2023 నుంచి కార్డులు సరఫరా లేవు. ప్రస్తుతానికి ఆన్‌లైన్‌లో లైసెన్సు డౌన్‌లోడ్ చేసుకోండి. కార్డులు వచ్చిన వెంటనే మీ చిరునామాకు పంపిస్తారు.

? ప్ర : తెలంగాణాలో తీసుకున్న డ్రైవింగ్ లైసెన్సు 2016లో లాప్స్ అయిపోయింది. దానిని బతికించుకోవచ్చా? **- నెక్కలపు వెంకటేశ్వరరావు, చాట్రాయి**

» స : తెలంగాణకు చెందిన పాత లైసెన్సు వదిలేసి. . కొత్తగా డ్రైవింగ్ లైసెన్సుకు దరఖాస్తు చేసుకోండి.

? హెవీ లైసెన్సు తీసుకోవడానికి ఎంత సీనియారిటీ ఉండాలి. **- దాసి పవన్ కుమార్, బొమ్మినంపాడు, ముదినేపల్లి మండలం, అశోక్, కోరుకొల్లు, కలిదిండి మండలం**

» ఎల్ఎంవీ లైసెన్సు తీసుకున్న రెండేళ్ల తరువాత హెవీ లైసెన్సు ఎల్ఎల్ఆర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఎల్ఎల్ఆర్ వచ్చాక హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 30 రోజులు శిక్షణ తీసుకోవాలి.

? ద్విచక్ర వాహనానికి ఆర్‌సీ చెల్లుబాటు సమయం అయిపోయింది. తూకానికి అమ్మేసుకోవచ్చా. **- జి.పాపారావు, భీమవరం**

» వాహనం ఛాసిస్ నంబరు ఉన్న ముక్కను కట్ చేసి తీసుకోవాలి. కొనుగోలుదారు నుంచి ఒక లేఖ తీసుకోవాలి. వాటితో కలిపి రవాణా శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే.. ‘సి’ బుక్ రద్దు చేస్తారు.

? రవాణా శాఖ యూనిట్ కార్యాలయం కైకలూరులో ఏర్పాటు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించారు. ఎప్పుడు ఏర్పాటు చేస్తారు. **- సీహెచ్ వెంకట దుర్గా ప్రసాద్, కైకలూరు**

» దీనికి సంబంధించిన ప్రతిపాదనలు పంపించాం. జోనల్ పునర్విభజన తరువాత కైకలూరులో యూనిట్ కార్యాలయం ఏర్పాటు చేస్తారు.

వారధులు కూలుతున్నాయ్!

కొత్త వంతెనల నిర్మాణాలకు కలగని మోక్షం

కొండంగిలో పంట కాలువపై కూలిన వారధి

కలిదిండి, ముదినేపల్లి, న్యూస్‌టుడే

ఇరుకు వంతెనలు ఒక్కొక్కటిగా కూలిపోతున్నాయి. ఎక్కడ ఏ వారధి కూలిపోయినా.. కొత్తవి నిర్మించే దిశగా గట్టి చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా ప్రజలకు గత్యంతరం లేక ప్రమాదకర ప్రయాణం చేయాల్సి వస్తోంది. కైకలూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో ఇరుకు వారధులు కూలిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

ఇవి కూలి చాలా కాలమైంది..

● కలిదిండిలోని లాల్వా కాలువ పైనున్న వంతెన ఎనిమిదేళ్ల కిందట కూలిపోయింది. కొత్త వారధి నిర్మించకుండా తూములు పెట్టి తాత్కాలికంగా రాకపోకలు పునరుద్ధరించారు. ఏడాది కిందట ఆ తూములు పగిలిపోయాయి. వాటికి మరమ్మతులు చేసి వదిలేశారు. మరో ఆరు నెలలకు ఆ తూములు నీటి ఉద్ధృతికి కొట్టుకుపోయాయి. అయినా.. తూములే పెట్టారు.

● కలిదిండి మండలంలోని కొండంగిలోనూ అదే పరిస్థితి. పదేళ్ల కిందటే పంట కాలువపై ఉన్న వంతెన శిథిలమైంది. ఉప్పుటేరు తీర ప్రాంతాలకు వెళ్లడానికి ఇదే ప్రధాన మార్గం కావడంతో రాకపోకలకు చాలా అవస్థ పడాల్సి వచ్చింది. దీంతో తాత్కాలికంగా తూములు పెట్టారు. నేటికీ కొత్త వంతెన ఊసే లేదు.

● ముదినేపల్లి మండలం పేరూరులో పోల్‌రాజ్ కెనాల్‌పై ఉన్న వంతెన కూలిపోయి చాలా కాలమైంది. దీనిని ఎవరూ పట్టించుకోకపోవడంతో రైతులు స్వచ్ఛందంగా మరమ్మతులు చేసుకున్నారు.

● ముదినేపల్లి మండలంలోని అన్నవరం మురుగు కాలువపై ఉన్న వారధి ఐదేళ్ల కిందట పడిపోయింది. దీనికీ రైతులే మరమ్మతులు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు.

అన్నవరం: కాలువపై ఏర్పాటు చేసిన తూములు

ప్రతిపాదనలు పంపించాం

కైకలూరు నియోజకవర్గంలో 52 వంతెనలు మరమ్మతులు చేయడానికి, ఇరుకు వారధులు కూలిపోయిన చోట కొత్తవి నిర్మించడానికి ప్రతిపాదనలు పంపించాం. అవి ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి

- అనిల్ కుమార్, ఆర్అండ్‌బీ డీఈఈ, కైకలూరు

మండలాల్లో ప్రత్యేక పాలన

బాధ్యతలు తీసుకున్న అధికారులు

జంగారెడ్డిగూడెం అర్బన్, కుక్కునూరు, ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: మండల పరిషత్ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో, ప్రత్యేక అధికారుల పాలన గురువారం నుంచి ప్రారంభమైంది. జిల్లాలోని 27 మండలాలకు అధికారులను నియమిస్తూ బుధవారం సాయంత్రం ఆదేశాలు జారీ అయ్యాయి. వారంతా గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించారు. స్థానిక ఎన్నికలు ముగిసి, కొత్త పాలక మండళ్లు కొలువుదీరే వరకు వీరే మండల పాలనా బాధ్యతలు చూడనున్నారు. ఎన్నికలు ఆలస్యం అయితే ఆరు నెలల వరకు వీరికి అధికారాలు ఉంటాయి.

నియమితులైన అధికారులు (మండలాల వారీగా)

కుక్కునూరు	ఎం. రాజశేఖర్	ఏపీడీ డ్వామా
వేలేరుపాడు	పీఎన్‌వీ శేఖర్‌దొర	ఏడీ పశుసంవర్ధక శాఖ
భీమడోలు	డి. దామోదరరావు	ఏపీడీ, డ్వామా
బుట్టాయగూడెం	ఎ. పద్మనాభరావు	ఏడీ, మార్కెటింగ్
ఆగిరిపల్లి	ఆర్. విలియమ్స్	జిల్లా పౌరసరఫరాల అధికారి
చింతలపూడి	వై. సుబ్బారావు	ఏడీ, వ్యవసాయశాఖ, చింతలపూడి
దెందులూరు	కె. శ్రీదేవి	ఫైనాన్స్ మేనేజర్, డ్వామా
చాట్రాయి	పి. అనురాధ	డీఎల్‌డీవో, నూజివీడు
జంగారెడ్డిగూడెం	ఎం. రాజు	డీఎల్‌డీవో, జంగారెడ్డిగూడెం
ద్వారకాతిరుమల	ఎస్. నిర్మలాజ్యోతి	ఏపీడీ, డ్వామా, ఏలూరు
ఏలూరు	ఈ. అనిల్‌కుమార్	ఏడీ, వ్యవసాయశాఖ
కామవరపుకోట	వి. మహేంద్రనాథ్	ఏడీ, మార్కెటింగ్, ఏలూరు
కలిదిండి	ముస్తాఫాఖాన్	ఏడీ, పశుసంవర్ధక శాఖ, కైకలూరు
కైకలూరు	రామకృష్ణ	డీఈఈ, డ్రెయిన్స్, కైకలూరు
జీలుగుమిల్లి	సాయిబుచ్చారావు	ఏడీ, పశుసంవర్ధక శాఖ
కొయ్యలగూడెం	సాయిరమేష్	ఏడీ, పశుసంవర్ధకశాఖ, గోపన్నపాలెం
లింగపాలెం	లింగయ్య	ఏడీ, పశుసంవర్ధకశాఖ, చింతలపూడి
మండవల్లి	వరప్రసాద్	ఏడీ, పశుసంవర్ధకశాఖ, మండవల్లి
ముదినేపల్లి	అనిల్‌కుమార్	డీఈఈ, ర. భ. శాఖ, కైకలూరు
ముసునూరు	నరసింహారావు	ఏడీ, పశుసంవర్ధకశాఖ, నూజివీడు
నిడమర్రు	విజయశ్రీ	ఏడీ, పశుసంవర్ధకశాఖ, దెందులూరు
నూజివీడు	రవికుమార్	డివిజినల్ సహకార అధికారి, నూజివీడు
పెదపాడు	రాజశేఖర్	ఏడీ, మత్స్యశాఖ, ఏలూరు
పెదవేగి	సంతోశ్	ఏడీ, ఉద్యానశాఖ, ఏలూరు
పోలవరం	రవిప్రసన్నకుమార్	డీఈఈ, ఐటీడీఏ
టి. నరసాపురం	గోవిందరాజు	డీడీ, పశుసంవర్ధకశాఖ, ఏలూరు
ఉంగుటూరు	షాజానాయక్	జిల్లా ఉద్యానశాఖాధికారి, ఏలూరు

నవీకరణ కాని 19 మద్యం దుకాణాలు

లైసెన్సుల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో 19 మద్యం దుకాణాల లైసెన్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి ఎ. ఆవులయ్య. 19 దుకాణాల యజమానులు నవీకరణ చేసుకోలేదన్నారు. వాటిని లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేసి.. అర్హులకు లైసెన్సులు జారీ చేస్తామని చెప్పారు. దరఖాస్తుల స్వీకరణకు 7 సర్కిల్ కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఏలూరు నగరంలో 7, గ్రామీణంలో 3, పెదపాడు 2, మండవల్లి 2, పెదవేగి, భీమడోలు, ముసునూరు, కైకలూరు, ముదినేపల్లి మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున దుకాణాలకు లైసెన్సులు జారీ చేయాల్సి ఉందన్నారు. అభ్యర్థులు ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఒక్కో దరఖాస్తుకు ప్రభుత్వం రూ. 3 లక్షలుగా రుసుము విధించిందని.. ఒకే అభ్యర్థి ఎన్ని దరఖాస్తులైనా పెట్టుకోవచ్చని వివరించారు. మండవల్లి మండలానికి చెందిన దుకాణాలకు వార్షిక లైసెన్సు రుసుం రూ. 60.50 లక్షలు కాగా, మిగిలిన అన్ని ప్రాంతాలకు రూ. 71.50 లక్షలని పేర్కొన్నారు. అక్టోబర్ 1 అర్ధరాత్రి 12 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాటిని అక్టోబర్ 3న పరిశీలించి.. 5న లాటరీ ద్వారా విజేతలను ఎంపిక చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

(ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్ట్సీ కోడ్, 2016 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు)

(రూ.లక్షల్లో)

లాట్ నెం.	దివాలాదారు పేరు	ఆస్తి స్వభావం	ప్రదేశం	ఆస్తుల సంక్షిప్త వివరం	రిజర్వు ధర (రూ.)	ఇఎండి (రూ.)
1.	వీరమాచనేని రామ మోహనరావ్	ఖాళీ స్థలం	నూజివీడు, ఏలూరు జిల్లా, ఆం.ప్ర.	934 చ.గజాలు, ఇంటి నెం.20-208, సత్యనారాయణ సినిమా థియేటర్‌కు ఎదురు లేన్, నూజివీడు టౌన్.	92.50	4.65
2.	వెనిగళ్ల వెంకట రఘుపతి రావ్	నివాస ఇల్లు గ్రౌండ్ + 2 పై అంతస్తులు	ఎంప్లాయీస్ కాలనీ, నూజివీడు, ఏలూరు జిల్లా, ఆం.ప్ర.	275 చ.గజాలు, ప్లాట్ నెం.27, సర్వే నెం.395/2, 397, ఎంప్లాయీస్ కాలనీ, కేంద్రీయ విద్యాలయ సమీపాన.	90.00	4.50

2. ఆసక్తి గల బిడ్డరు https://www.bankeauctions.comలో ఇ-వేలం ప్రాసెస్ ఇన్ఫర్మేషన్ మెమొరాండంను చూడవచ్చును లేదా శ్రీ మురళీ మోహన్‌ను bt.chevuturi@gmail.com ద్వారా లేదా మొబైల్ నెం. 8978844588పై సంప్రదించండి.
3. ఇఎండిని NEFT/RTGS ద్వారా ఖాతా నెం.60524731074, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సుల్తాన్ బజార్ శాఖ, IFSC: MAHAB0000010కి జమ చేయవలెను.
4. బిడ్స్/ ఇఎండి దాఖలుకు చివరి తేది: 05.10.2026 మరియు ఇ-వేలం తేది, సమయం: 07.10.2026

తేది: 25.09.2026
ప్రదేశం: హైదరాబాద్

సం/- మురళీ మోహన్ చెవుటూరి, బ్యాంక్రప్ట్సీ ట్రస్టీ
IBBI/IPA-003/00307/2020-2021/13464

నగరపాలక సంస్థ, ఏలూరు
పత్రికా ప్రకటన

ఆర్.ఒ.సి.నెం. MAU020/63/2026/జి1 తేది. 24–09–2026

గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్, ఎ.పి. వారు జారీ చేసిన సర్క్యులర్ నెం. 526/SEC-F1/2026, తేది. 21-09-2026 వారి ఆదేశాలు మేరకు ఏలూరు నగరపాలక సంస్థనకు సంబంధించి ఎన్నికల నిమిత్తము 62 వార్డులకు గాను పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను ది. 25-09-2026వ తేదీన ప్రకటించటమైనది. సదరు పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను మున్సిపల్ కార్యాలయం నోటీసు బోర్డు నందు, శ్రీయుత జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము నందు, శ్రీయుత ఏలూరు రెవిన్యూ డివిజన్ కార్యాలయము నందు, శ్రీయుత ఏలూరు మండల తహశీల్దార్ వారి కార్యాలయము నందు, ఏలూరు జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయము నందు, గౌరవ జిల్లా కోర్టు ప్రాంగణము నందు, ఏలూరు నగర హెడ్ పోస్టు ఆఫీసు నందు మరియు వార్డు సచివాలయముల నందు ప్రకటించడమైనదని తెలియజేయుచూ ఏలూరు నగర ప్రజల నుండి అభ్యంతరములు / సూచనలు ఉన్నచో ది. 26-09-2026వ తేది సాయంత్రం గం. 5.00 లోపు ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయమునకు అందు విధముగా లిఖితపూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరడమైనది.

సం/- **కమిషనరు**
నగరపాలక సంస్థ, ఏలూరు.

సౌకర్యాలు.. భద్రతా చర్యలకు పెద్దపీట

ద్వారకా తిరుమల దేవస్థానం పాలక మండలి నిర్ణయం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పాలకమండలి నిర్ణయం తీసుకుంది. దేవస్థానం ట్రస్ట్ బోర్డు సమావేశం గురువారం అధ్యక్షుడు ఎస్వీ సుధాకరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భద్రతా చర్యలు, వివిధ అభివృద్ధి పనులను అంశాల వారీగా చర్చించి, నిర్ణయాలు తీసుకున్నారు. మినీ కల్యాణ మండపం నిర్మించేందుకు, స్వామివారి నిత్య కైంకర్యాల కోసం దేవుడి తోటలో తులసి వనం పెంచడానికి నిర్ణయం తీసుకున్నారు. దేవస్థానం ఉన్నత పాఠశాల వద్ద ఉన్న వినాయకుడి గుడిని పాఠశాల ప్రాంగణంలోని ఖాళీ స్థలంలోకి, దేవస్థానం దిగువన ఉన్న సమాచార కేంద్రం, ప్రసాదాల కౌంటర్‌ను బాలాజీ సదనం గ్రౌండ్ ఫ్లోర్‌లోకి మార్చడానికి ఆమోదించారు.

దుకాణాల హక్కులు.. ఆలయానికి తూర్పు వైపున హరేకృష్ణ మూవ్‌మెంట్ ఇండియా వారికి నామమాత్రపు రుసుముతో స్టాల్ కొనసాగించడానికి, తితిదే సదనం, శివాలయం, భీమడోలులో షాపింగ్ కాంప్లెక్స్‌లో వ్యాపారాలు చేసుకోవడానికి లైసెన్స్ హక్కులకు నిర్వహించిన బహిరంగ వేలంలో హెచ్చుపాటలను ఆమోదించారు. ఆలయానికి తూర్పు వైపున షాపింగ్ కాంప్లెక్స్‌లో 3, 5, 6, 7, 8, 13, 14, 21 నంబర్లు గల షాపుల్లో వ్యాపారం చేసుకోవడానికి లైసెన్స్ హక్కుకు, కేశ ఖండనశాల వద్ద కొబ్బరి కాయలు, పూజ ద్రవ్యాలు అమ్ముకునే లైసెన్స్ హక్కుకు ఇ-ప్రొక్యూర్మెంట్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలంలో వచ్చిన హెచ్చుపాటలను అంగీకరించారు.

రక్షణ కోసం.. కొండపైన భద్రతా చర్యల్లో భాగంగా ఉరుములు, పిడుగుల నుంచి రక్షణ కోసం ఆలయ దక్షిణ రాజగోపురం, పవర్ హౌస్, శ్రీ ధర్మ అప్పారాయ నిలయంలో లైటింగ్ ఏర్పాటు చేయడానికి వచ్చిన తక్కువ టెండర్‌ను ఆమోదించారు. ప్రస్తుతం ఉన్న సీసీ టీవీ కెమెరాల 90 రోజుల బ్యాకప్ నిమిత్తం 16 టీబీ హార్డ్ డిస్క్ సమకూర్చడానికి పిలిచిన ఇ-టెండర్‌లో తక్కువకు ఆమోదం తెలిపారు. శ్రీధర్మ అప్పారాయ నిలయంపై 2వ, 3వ అంతస్తుల నిర్మాణం దృష్ట్యా పెరుగుతున్న విద్యుత్తు లోడ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ యార్డ్ నుంచి యూజీ కేబుల్, హెచ్‌టీ వీసీబీ ప్యానల్ బోర్డ్స్ ఏర్పాటు చేయడానికి వచ్చిన తక్కువ టెండర్‌ను అంగీకరించారు. శ్రీవారి ఉపాలయమైన భ్రమరాంబమల్లేశ్వర స్వామి ఆలయం వద్ద, శ్రీవకుళమాత అన్నదాన భవనం వద్ద బస్ షెల్టర్లు నిర్మించడానికి వచ్చిన తక్కువ టెండర్‌ను ఆమోదించారు. కొండపైన నీటి సరఫరా సెక్షన్ కోసం ఓహెచ్ఎస్ఆర్ కింద నిర్వహణ గది నిర్మించి, అన్ని ట్యాంకులకు రంగులు వేయడానికి అంచనాలను సమ్మతించారు. పడమర రాజగోపురం పక్కన పాత దీపారాధన మండపం స్థానంలో ఆశీర్వచన మండపం నిర్మించడానికి తయారు చేసిన అంచనాలు ఆమోదించారు. శ్రీవారి ప్రధాన, దత్తత దేవాలయాలు, వివిధ ట్రస్ట్‌లకు సంబంధించి ఆగస్టు నెల ఆదాయ వ్యయాలను పరిశీలించి ఆమోదించారు.

విద్యుత్తు సమస్యా.. 1912కు ఫోన్ చేయండి

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు ఎస్ఈ అంబేడ్కర్. కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశానుసారం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అదనపు సిబ్బందిని సిద్ధంగా ఉంచామన్నారు. జిల్లాలో ఎక్కడా ఇబ్బంది లేదని, చెదురుముదురుగా కొన్నిచోట్ల కండక్టర్లు దెబ్బతిన్నాయని, వెంటనే వెంటనే పునరుద్ధరించామని చెప్పారు. ఎక్కడైనా విద్యుత్తు సమస్యలున్నా, తీగలు తెగిపోయినా, నిప్పు రవ్వలు పడినా, పరివర్తకాలు దెబ్బతిన్నా వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేయాలన్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్లకు సంబంధించి కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామన్నారు. ఏలూరు 94409 04037, జంగారెడ్డిగూడెం 94910 30712 నంబర్లకు ఫోన్ చేయాలని ఆయన పేర్కొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు.. వర్షాల నేపథ్యంలో పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుపై పడటంతో.. వాటిని ఆయా శాఖల సిబ్బంది తొలగించారు. ఎక్కడా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.

సమస్యలపై మండిపడ్డ సభ్యులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ప్రసాదాలు తయారు చేయడానికి మనుషులను పంపించే కాంట్రాక్ట్‌ను దేవస్థానం అధికారులు తమకు కావాల్సిన వారికి ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నారని ట్రస్ట్ బోర్డు సభ్యుడు చింతమనేని హనుమంతరావు ఆరోపించారు. అందుకోసం పదేపదే టెండర్ నిబంధనలు మారుస్తూ.. రావడం సరికాదన్నారు. సింగిల్ టెండర్‌తో కావాల్సిన వారికి కట్టబెడితే కుదరదని స్పష్టం చేశారు. విశ్రాంత ఈఈ ఎన్‌వీఎస్ రాజుని మళ్లీ దేవస్థానంలో పీఎస్ ఛార్జెస్ కింద టెక్నికల్ సలహాదారుగా నియమించడానికి దేవస్థానం ఛైర్మన్ సుధాకరరావు దేవాదాయశాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. అయితే ట్రస్ట్ బోర్డు ఆమోదం లేకుండా ఆర్డర్ ఇవ్వడం కుదరదని కమిషనర్ తేల్చి చెప్పడంతో ఈ అంశాన్ని సమావేశంలో పెట్టారు. విశ్రాంత ఉద్యోగులకు మళ్లీ ఉద్యోగ అవకాశాలు కల్పించడం కుదరదని ట్రస్ట్‌బోర్డు సభ్యులు తేల్చి చెప్పడంతో రద్దు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి బస్సుల్లో క్షేత్రానికి వచ్చే భక్తులు స్థానిక గరుడ విగ్రహం సమీపంలో మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అక్కడ నిర్మించాలని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవస్థానం నడుపుతున్న భీమడోలు, కామవరపుకోట కళాశాలలకు సంబంధించిన అధ్యాపకులకు గత పీఆర్‌సీ ఎరియర్ బకాయిలు అందజేయమని చెప్పినా దేవస్థానం అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

కాంతిలాల్ దండేకు సమస్య వివరిస్తున్న కమిటీ సభ్యులు

మొర ఆలకించండి మహాప్రభో

పీఎఫ్ సమస్యపై ఉపాధ్యాయ, ఉద్యోగులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: కైకలూరు, నూజివీడు నియోజకవర్గాల ఉపాధ్యాయ, ఉద్యోగులు ఎదుర్కొంటున్న పీఎఫ్ సమస్య పరిష్కరించాలని ఎన్నిసార్లు ఎంతమందికి విన్నవించుకుంటున్నా పట్టించుకోవడంలేదని పీఎఫ్ పోరాట కమిటీ సభ్యులు పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే వద్ద మొరపెట్టుకున్నారు. కాంతిలాల్ స్వగ్రామమైన కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం పెదతుమ్మిడిలో గురువారం ఆయనను కలిసి మాట్లాడారు. 46 నెలలుగా తాము ఈ సమస్యతో ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందిపడుతూ అందరిని కలిసి మొర పెట్టుకుంటున్నామని తెలిపారు. 2023, 2025లో సుమారు 500 మందికిపైగానే కృష్ణా, గుంటూరు జిల్లాలకు బదిలీపై వెళ్లిపోయారని, ఇప్పుడు వారు నూతనంగా ఖాతాలు తెరవడం సాధ్యంకాదని తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ జిల్లాలకు రెండు, మూడు రోజుల్లో నూతన సీఈవోల నియామకం జరుగుతుందని తెలిపారు. మృతి చెందిన, బదిలీ అయినవారివి ముందుగా పరిష్కరించి, అతిత్వరలోనే అందరి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కమిటీ సభ్యులు రమేశ్, బి. రాజేంద్రప్రసాద్, దండే బన్నీపాల్, వెంకటరత్నం, బెనర్జీ, బి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డెల్టాలో ఎగదన్నుతున్న డ్రెయిన్లు

వర్షం కొనసాగితే ముంపు బారిన పడే ప్రమాదం

ఉండి, న్యూస్‌టుడే: ఉభయ జిల్లాల్లో ఎడతెరపిలేని వర్షాలతో వివిధ డ్రెయిన్లలో మురుగునీటి ప్రవాహం ఒక్కసారిగా పెరుగుతోంది. ప్రధానంగా మైనర్, మీడియమ్ డ్రెయిన్లలో చాలాచోట్ల అంచులు తాకి ప్రవహిస్తోంది. పల్లపు, మురుగు కాలువలకు ఆనుకొని ఉన్న చేలల్లో అడుగున్నర నుంచి రెండు అడుగుల వరకూ నీరు నిలిచింది. ఖరీఫ్ చేలు అంత కంటే ఎత్తుకు ఎదగడంతో ఇప్పటివరకూ క్షేమంగానే కనిపిస్తున్నాయి. వర్షాలు ఇదేరీతిలో మరో రెండ్రోజులు కొనసాగితే పల్లపు ప్రాంతాల్లో వరి చేలు ముంపు బారిన పడే ప్రమాదముందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

సర్‌ప్లస్ వియర్లు తెరిచి.. ఉభయ జిల్లాల్లో 4.61 లక్షల ఎకరాల్లో ఖరీఫ్‌లో వరి పంట సాగు చేస్తున్నారు. డెల్టాలో కాలువల వ్యవస్థపై 29 మండలాల్లో 3.50 లక్షల ఎకరాల్లో వరి పండుతోందని అంచనా. ప్రధాన పంట కాలువలకు బుధవారం వరకూ 7 వేల క్యూసెక్కులు నీరొదిలారు. బుధ, గురు వారాల్లో ఎడతెరపిలేని వర్షాలు కురవడంతో గురువారం 5 వేల క్యూసెక్కులే నీరొదిలామని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రధాన కాలువల్లో ప్రవాహం బాగా పెరగడంతో పరిమెళ్ల, చిలకంపాడు, యండగండి, ఉండి, ఏలూరుపాడు, చినకాపవరం తదితర ప్రాంతాల్లో సర్‌ప్లస్ వియర్లు తెరిచి సాగునీటిని డ్రెయిన్లలోకి మళ్లిస్తున్నారు.

ఉండి అక్విడక్టు వద్ద మురుగును అడ్డుకుంటున్న వ్యర్థాలు

సర్‌ప్లస్ వియర్ గేట్లు తెరిచి డ్రెయిన్‌లోకి వదులుతున్న సాగునీరు

నిండు కుండలా.. కొందరు చేపల చెరువుల్లో అదనపు నీటిని బయటకు వదిలేస్తుండటంతో ఆయా డ్రెయిన్లు నిండుకుండలా తయారవుతున్నాయి. బొండాడ, రుద్రాయకోడు, మొగదిండి, రాయలం, చినకాపవరం, గునుపూడి సౌత్, బగ్గేశ్వరం, నక్కల, అడ్డాలగ్రీకు, బక్లీసు, పందికోడు, ఓల్డు వయ్యేరు, బసవరాజుకోడు, యండగండి తదితర డ్రెయిన్లలో నీటి ప్రవాహం పెరుగుతోంది. తూడు, గుర్రపుడెక్క పూర్తిస్థాయిలో తొలగించని, గట్లు ఆక్రమణలకు గురైన ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోందని రైతులు వాపోతున్నారు. ఈ మురుగంతా ఉప్పుటేరులోకి చేరేందుకు ఎన్ని రోజులు పడుతుందనే అనుమానాలు రేగుతున్నాయి. డ్రెయిన్ల ప్రక్షాళన పనులు నూరుశాతం పూర్తి చేసి ఉంటే మురుగునీటి పారుదల వ్యవస్థకు అంతగా అవరోధాలు ఉండేవి కావని పలువురు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో డ్రెయిన్ల వివరాలు

మేజర్	: 21 (409 కి.మీ)
మీడియం	: 59 (351 కి.మీ)
మైనర్	: 579 (1,513 కి.మీ)

అప్రమత్తతే కీలకం: మంత్రి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: సహాయక కార్యక్రమాల్లో ప్రభుత్వ ప్రతిష్ఠను ఇనుమడింపజేసేలా జిల్లాఅధికార యంత్రాంగం పని చేయాలని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గురువారం ఆయన తుపాను పరిస్థితిపై వర్చువల్ పద్ధతిలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. నూజివీడుతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో భారీ వర్షాలతో ముప్పు ఉన్న ప్రతి ప్రాంతాన్ని పరిశీలించాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఆస్తి, పంట, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని దిశానిర్దేశం చేశారు. వర్షం అనంతరం పంట నష్టం అంచనాలను రూపొందించాలి. వరద నీటిలో మునిగిన పంటలను కాపాడుకునేందుకు తీసుకునే చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వాగులు, డ్రెయిన్లలో చెత్తను వెంటనే తొలగించి వరద నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. చెట్లు కూలితే వెంటనే తొలగించాలని సూచించారు. విద్యుత్తు వైర్లు ఎక్కడైనా తెగి పడితే ప్రమాదం జరగకుండా చూడాలన్నారు. కూలిన స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి: ఎంపీ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో రెండ్రోజులుగా ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురుస్తుండటం.. శుక్రవారమూ కొనసాగే అవకాశం ఉండటంతో.. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎంపీ మహేశ్ కుమార్ సూచించారు. భారీ వర్షాలతో ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. అత్యవసర స్థితిలో ప్రజలు తన కార్యాలయంలోని 95152 25125, 98855 19299 నంబర్లకు ఫోను చేయొచ్చని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

‘నాలుగు సందర్శనలు’ రద్దు

పవరుపేట(ఏలూరు కలెక్టరేట్), న్యూస్‌టుడే: దెందులూరు మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించాల్సిన ‘ఒక నెల, ఒక నియోజకవర్గం, నాలుగు సందర్శనలు’ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా కార్యక్రమాన్ని రద్దు చేశామని ఆమె గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అండర్-19 క్రీడా పోటీలు వాయిదా

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: పెదవేగిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల మైదానంలో శుక్రవారం నిర్వహించాల్సిన పలు క్రీడా పోటీల బాలుర జిల్లా జట్ల ఎంపికలను భారీ వర్షాల కారణంగా వాయిదా వేసినట్లు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి కె. జయరాజు తెలిపారు. అండర్-19 విభాగంలో అథ్లెటిక్స్, జూడో, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్ తదితర క్రీడల నిర్వహణ తేదీలను త్వరలోనే తెలియజేస్తామని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యుత్తు నియంత్రికను ఢీకొన్న కారు

కైకలూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను కారు ఢీకొన్న సంఘటన మండలంలోని గోపవరంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కలిదిండి వైపు నుంచి కైకలూరు వస్తున్న ఓ కారు గోపవరం రైల్వేగేట్‌కు కూత వేటు దూరానికి వచ్చే సమయానికి చోదకుడు అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. ఈ క్రమంలో కారు అదుపు తప్పి రోడ్డు చెంతనే ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను బలంగా ఢీకొట్టింది. దానికి ఉన్న రెండు స్తంభాలు విరిగిపోగా.. విద్యుత్తు తీగలు తెగి పడి వెంటనే సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో చోదకుడికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కారు ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. దీనిపై ఇప్పటి వరకు ఎటువంటి కేసు నమోదు కాలేదు.

మిట్టగూడెంలో రూ.15,30,999 పలికిన గణేశ్ లడ్డూ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని నూజివీడు మండలంలోని మిట్టగూడెంలో ఏర్పాటు చేసిన గణనాథుడి చేతిలో ఉన్న లడ్డూ దక్కించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. గురువారం రాత్రి గణేశ్ లడ్డూ వేలం పాట నిర్వహించగా వెలివెల కనక దుర్గారావు రూ. 15,30,999కు దక్కించుకున్నారు. నిత్య పూజలందుకున్న లడ్డూను కమిటీ సభ్యులు భక్తుల కోలాహలం మధ్య పాటదారుకు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు, తెదేపా మండల అధ్యక్షుడు యనమదల వాసు, సర్పంచి కొనకాల నరసింహారావు, కొనకాల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 243 చికెన్ స్కిన్‌లెస్ - 275.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.

11 నుంచి రోలర్ స్కేటింగ్ ఎంపిక పోటీలు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి ఆర్ఎస్ఎఫ్ఐ, ఏపీఆర్ఎస్ఏ రోలర్ స్కేటింగ్ ఎంపిక పోటీలు వచ్చే నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ కార్యదర్శి కానాల బాలవెంకట రమేశ్ తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు 31 నుంచి నవంబరు 5 వరకు కాకినాడ వేదికగా జరగనున్న అంతర్ జిల్లా ఏపీ రాష్ట్ర రోలర్ స్కేటింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఔత్సాహికులు తమ దరఖాస్తులను వచ్చే నెల 3లోపు అందజేయాలని, మరిన్ని వివరాలకు 98481 88077, 98481 88097 నంబర్లను సంప్రదించాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పండగలకు ప్రత్యేక రైళ్లు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: దసరా, దీపావళి పండగల సందర్భంగా ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పీఆర్వో కార్యాలయం తెలిపింది. అక్టోబరు 7 నుంచి నవంబరు 25 వరకు సికింద్రాబాద్-కాకినాడ టౌన్(07039), అక్టోబరు 8 నుంచి నవంబరు 26 వరకు కాకినాడ టౌన్- సికింద్రాబాద్(07040) రైళ్లు రాకపోకలు సాగిస్తాయని చెప్పారు. మార్గం మధ్యలోని నల్గొండ, మిర్యాలగూడ, విష్ణుపురం, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమహేంద్రవరం, సామర్లకోట స్టేషన్లలో రైళ్లు ఆగుతాయని గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది.

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph. 81422 92071.

ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్స్, బాటిల్ ఫిల్లింగ్, పెట్ బాటిల్ మేకింగ్ మెషిన్లు ష్రింక్ & BOPP లేబులింగ్, సాఫ్ట్‌డ్రింక్ మెషిన్లు సేల్స్, సర్వీస్. 8074969040

JOBS

Wanted Teachers for Primary and Highschool all Subjects. Salary Primary: 8K-15K, Higher: 15K-22K. 83097 09043, Veeravasaram.

REAL ESTATE

PLOT FOR SALE

Gated community RERA approved plots on highway in Chodavaram within 15 minutes from Benz Circle, Vijayawada. Contact: 9966116668

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

నెక్ సూచించిన కోడిగ్రుడ్డ ధర

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.40 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254